క్లుప్తంగా

మాజీ చైర్మన్‌కు పరామర్శ



యాతం శ్రీశైలం యాదవ్‌ను పరామర్శిస్తున్న నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌కు చెందిన బడంగ్‌పేట్ నగర పంచాయతీ మాజీ చైర్మన్ యాతం శ్రీశైలం యాదవ్‌ను గురువారం మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ రెడ్డి, తిరుపతిరెడ్డి, బండారి అశోక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండు తెగులు నివారణకు చర్యలు

ఏఓ అరుణకుమారి



వరిపంటను పరిశీలిస్తున్న అరుణకుమారి

ఆమనగల్లు: పంటల్లో ఎండుతెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లిలో గురువారం వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలను ఆమె పరిశీలించారు. పంటల్లో ఎండుతెగులు నివారణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు జంగయ్య, పంతు, జంగయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓల్డేజ్ హోంకు టీవీ బహూకరణ



ఎల్‌ఈడీ టీవీని అందజేస్తున్న విష్ణుగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బాటసింగారంలో గల వేంకటేశ్వర సోషల్ సర్వీస్ అసోసియేషన్ ఓల్డ్ ఏజ్ హోంకు బాటసింగారం మాజీ ఎంపీటీసీ, మండల బీజేపీ అధ్యక్షుడు విష్ణుగౌడ్ గురువారం ఎల్‌ఈడీ టీవీని అందజేశారు. తన తండ్రి బండిగారి లక్ష్మీనారాయణ గౌడ్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆశ్రమ నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు టీవీని అందజేసినట్లు విష్ణుగౌడ్ తెలిపారు. భవిష్యత్‌లో వృద్ధాశ్రమానికి ఎలాంటి అవసరం ఉన్నా అండగా ఉంటానన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: కడ్తాల్ బీసీ కాలనీకి చెందిన నారమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని గురువారం రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, రైతుబంధు మండల కన్వీనర్ వీరయ్య, వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు కృష్ణ, దేవానాయక్, శ్రీకాంత్, శ్రీను, మల్లేశ్, మణికంఠ, శివ ఉన్నారు.

సలీం కుటుంబానికి..

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన సలీం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా గురువారం పరామర్శించి వారివారి ట్రస్టుల ద్వారా చెరో రూ.5వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు ఇర్షాద్, కృష్ణ,శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

యాదయ్యకు నివాళి

ఆమనగల్లు: ఇటీవల మృతిచెందిన టీడీపీ రాష్ట్ర నాయకుడు, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన వ్యవస్థాపకులు బికుమాండ్ల యాదయ్య సంతాపసభను గురువారం ఆమనగల్లు పట్టణంలో నిర్వహించారు. యాదయ్య చిత్రపటానికి నేతలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ గుర్రం కేశవులు, స్థానిక నాయకులు, యాదయ్య కుటుంబ సభ్యులు ప్రమోద్, శ్రీనివాస్‌త, రవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

షాబాద్: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని చేవెళ్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామానికి చెందిన కొంత మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు.

నిరాశ్రయులకు ఆశ్రయం

- ఒంటరి మహిళలకు చేయూత
- అక్కున చేర్చుకొని ఆదరిస్తున్న ఆశ్రమం
- శిథిలావస్థకు చేరిన భవనం
- దాతలు సహకరిస్తే సేవలు విస్తరిస్తాం



నైట్‌షెల్టర్ ఫర్ హోమ్‌లెస్ పీపుల్ భవనం

హుడాకాంప్లెక్స్: కన్న బిడ్డల ఆదరణకు నోచుకోని నిరుపేద తల్లులు, తోడు కోల్పోయి ఒంటరిగా మిగిలిన వితంతువులు, తల్లిదండ్రుల ఆదరణ లేక రోడ్డున పడిన ఆడబిడ్డలు, భర్త వదిలేసిన భార్యలు, మతిస్థిమితం లేని మహిళలు ఇలా ఒంటరి మహిళలకు సరూర్‌నగర్‌లోని 'నైట్‌షెల్టర్ ఫర్ హోమ్‌లెస్ పీపుల్' ఆశ్రయం కల్పిస్తోంది. ఒంటరి మహిళలకు నీడనివ్వడమే కాకుండా మూడు పూటలా కడుపు నిండా భోజనం పెట్టి ఆదరిస్తుంది. 'నేనున్నాను' అంటూ ఓదార్పునిస్తోంది.

ఏ ఆదరణ లేని వారికి..

చివరి మజిలీలో ఏ ఆదరణ లేని వృద్ధులకు, ఒంటరి మహిళలకు ఆశ్రయం కల్పించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 2013లో భారత మహిళా సంఘం ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లోని చౌడీవద్ద ప్రభుత్వ భవనంలో నైట్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసింది. ఎల్బీనగర్, సరూర్‌నగర్, హయత్‌నగర్, ఉప్పల్ సర్కిళ్ల పరిధిలోని ఒంటరి మహిళలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. కేవలం స్వరాష్ట్రం వారే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వారు కూడా ఇక్కడ సేదతీరుతున్నారు. ఈ తొమ్మిదేళ్లలో 250 నుంచి 300 మందికి ఆశ్రయం కల్పించారు. ప్రస్తుతం ఇక్కడ 16 మంది ఒంటరి మహిళలు ఉన్నారు. ఒకరినొకరు తోడు నీడలా ఉంటున్నారు. ఒకరి బాధను మరొకరితో పంచుకుంటూ గత స్మృతులను నెమరువేసుకుంటూ ఒంటరితనాన్ని మర్చిపోతున్నారు.

కొత్త భవనం ఏర్పాటు చేస్తే ఎక్కువ మందికి సేవలు అందిస్తా..



ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇందులో 20 మందికి ఆశ్రయం కల్పించే అవకాశం ఉంది. అదనంగా వచ్చిన వారిని ఆదరించలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. కొత్త భవనం నిర్మిస్తే మరింత మందికి ఆశ్రయం కల్పిస్తాం. ఇక్కడ ఉన్న వారికి మూడు పూటలా మంచి ఆహారం అందజేయడంతో పాటు దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు కూడా అందజేస్తున్నాం. వినోదం కోసం టీవీని ఏర్పాటు చేశాం. యోగా శిక్షణా శిబిరాలు నిర్వహించి వారి ఆరోగ్యాన్ని కాపాడుతున్నాం.

– సాజీదా, హోం నిర్వాహకురాలు

కుటుంబ సభ్యుల మధ్య ఉన్నట్టు ఉంది..

మూడేళ్ల క్రితం భర్త చనిపోయాడు. పిల్లలు కూడా లేరు. ఒంటరినయ్యాను. ఊర్లో బంధువులున్నా వారికి భారం కాకూడదనే ఆలోచనతో వారికి దూరంగా ఇక్కడికి వచ్చాను. అంతా కలిసి ఉండటం వల్ల ఒంటరి తనం అనే భావన కూడా కలగడం లేదు. కుటుంబ సభ్యుల మధ్య గడిపినట్లే ఉంది.

– ఊర్మిళ, నైట్ షెల్టర్ ఫర్ హోమ్‌లెస్ పీపుల్

చూసేవారు లేక..

భర్త లేడు. కుమారుడు కూడా ఇటీవలే చనిపోయాడు. కుమార్తె ఉన్నా, అక్కడ ఉండేందుకు వసతి లేదు. దీంతో ఈ ఆశ్రమానికి వచ్చాను. ప్రస్తుతం ఇక్కడ సంతోషంగా ఉన్నా. వృద్ధాప్య పించను కూడా అందుతుంది. కుమార్తె అప్పుడప్పుడు వచ్చి చూసి వెళ్తుంది.

– సురేఖ, నైట్ షెల్టర్ ఫర్ హోమ్‌లెస్ పీపుల్

ఎస్సీ వర్గీకరణకు బీజేపీ మద్దతు

మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్



మందకృష్ణను సన్మానిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: ఎస్సీ వర్గీకరణకు బీజేపీ మద్దతిస్తుందని మహేశ్వరం నియోజకర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆలంపూర్ నుంచి హైదరాబాద్‌కు చేపట్టిన పాదయాత్ర గురువారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా కడాది బీరప్ప ఫంక్షన్‌హాల్‌లో బస చేసిన మందకృష్ణను బీజేపీ మహేశ్వరం నియోజకర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. ఏండ్ల తరబడి పోరాడుతున్న మందకృష్ణ మాదిగ ఆశయం నేరవేరాలని ఆయన కోరారు. వర్గీకరణతోనే మాదిగలకు తగిన న్యాయం జరుగుతుందని మందకృష్ణమాదిగ అన్నారు. వర్గీకరణకోసం తను ఎంతటి పోరాటం చేయడానికైనా సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. అనంతరం మందకృష్ణను అందెల శాలువా కప్పి సత్కరించి పాదయాత్రకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎస్సీమోర్చ నాయకులు గడ్డం వెంకటేశ్, చిత్రం శ్రీను, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల పాలిట కొంగుబంగారం



అమ్మవారి పూజలో పాల్గొన్న ఆలయ ధర్మకర్త, మహిళలు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల కేంద్రం పంజాల అనిల్‌కుమార్ కాలనీలో వెలసిన శ్రీ విజయ దుర్గాదేవి అమ్మవారి దేవాలయం భక్తుల పాలిట కొంగుబంగారంగా మారింది. మూడేళ్ల క్రితం కొలువుదీరిన ఈ ఆలయంలో దుర్గామాత నిత్యం పూజలు అందుకుంటోంది. ఆలయంలో వార్షికోత్సవ వేడుకలతో పాటు గణపతి ఉత్సవాలు, దేవి నవరాత్రులు, మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని అన్నపూర్ణమాత రూపంలో అలంకరణ చేశారు. 101 రకాల వంటకాలు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ధర్మకర్త ఇంటూరి విద్యారెడ్డి మాట్లాడుతూ ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు స్వప్నజ్యోతి, శ్వేత, సరిత, ఇంటూరి అంకిరెడ్డి, రుషిగుప్తా పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

ఏనుగు జంగారెడ్డి, మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి



పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: వచ్చే ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని పీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో కటికపల్లి, గూడూరు, లేమూరు, దావూద్‌గూడల్లో గడప గడపకు కాంగ్రెస్ నిర్వహించారు. తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఏఏ పథకాలు అమలు చేయనున్నది వారు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, అందరూ కాంగ్రెస్‌నే బలపర్చాలని కోరారు. లేమూరు నుంచి మాజీ సర్పంచ్ గూడూరు కొండారెడ్డి, కటికపల్లి, గూడూరుల నుంచి వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు సరికొండ మల్లేశ్, వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, అందుగుల సత్యనారాయణ, పార్టీ మహిళా అధ్యక్షురాలు ప్రశాంతిపాండురంగారెడ్డి, యూత్ అధ్యక్షుడు దంతోజు నర్సింహాచారి, మండల ఉపాధ్యక్షుడు సయ్యద్ అజీజ్, కోఆప్షన్ సభ్యుడు సులేమాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా మైనార్టీ జనరల్ సెక్రటరీ ఎండీ అఫ్జల్‌బేగ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధానకార్యదర్శి టి.వినోద్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



కందుకూరులో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుకూరు: మాదిగల సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం ఎమ్మార్పీఎస్ నవంబర్ 5వ తేదీన చేపట్టనున్న చలో ఇందిరా పార్కు జయభేరి సభ విజయవంతం చేయాలని కోరుతూ గురువారం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు చిన్నగళ్ల యాదగిరి మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు మాదిగ డిక్లరేషన్‌ను ప్రకటించాలన్నారు. డప్పు, చెప్పు వృత్తిదారులకు రూ.4వేలు పింఛన్, ప్రతీదళిత కుటుంబానికి దళిత బంధు, మంత్రి వర్గంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొద్ర రాములు, గడ్డం రాంచంద్రి, ఊటు మల్లేశ్, బాల్‌రాజ్, కె.రాములు, కె.ఎల్లయ్య, బి.అశోక్, కంద నరేష్, ఎం.క్రిష్ణ, కంద పెద్ద నర్సింహా పాల్గొన్నారు.

దేశంలోనే ఆదర్శం తెలంగాణ

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మంత్రి సమక్షంలో పార్టీలో చేరిన బీజేపీ కార్యకర్తలు

పహాడీషరీఫ్: దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని, కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ యూత్ వింగ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల అర్జున్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు మంత్రి సమక్షంలో గురువారం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతీగడపకు అందాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో పట్ల పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి కో-ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, పార్టీ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల జనార్దన్, ఉపాధ్యక్షుడు దూడల శ్రీనివాస్ గౌడ్, నగేశ్ ముదిరాజ్, సూరెడ్డి గోపాల్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

శంకర్‌పల్లి: రైతు సమస్యలను పరిష్కరించాలని సంఘం పిలుపు మేరకు గురువారం శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదట మండల రైతు సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సురేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం ఉపాధ్యక్షుడు, రంగారెడ్డి జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. ప్రభులింగం మాట్లాడుతూ బ్యాంకింగ్ రెగ్యులేషన్ సవరణ చట్టం 2020లోని సెక్షన్ 12-1, రాష్ట్ర సహకార సంఘాల సవరణ చట్టం 2023లోని సెక్షన్ 26ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుధీర్, శివరాజ్, బుచ్చయ్య, జంగయ్య, మహిళా సంఘం నాయకులు చిలుకమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం

పారిజాత నర్సింహా రెడ్డి



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న పారిజాత నర్సింహా రెడ్డి

పహాడీషరీఫ్: కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీ పథకాలు, బీఆర్ఎస్ వ్యతిరేకతతో ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లోకి చేరుతున్నారని బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీ 3వ వార్డు డ్రీమ్ సిటీలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముస్లింల ప్రగతి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జిల్లా నాయకులు రియాజ్ ఖాన్, బీఎంసీ మైనార్టీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ అహ్మద్, ఉపాధ్యక్షుడు మహ్మద్, అబ్దుల్ బారీ, బాబా తదితరులు పాల్గొన్నారు.

మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలి

ఇంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్టు చైర్మన్ పి కార్తీక్‌రెడ్డి



ఉద్యోగాలకు ఎంపికైన యువకులను సన్మానిస్తున్న కార్తీక్‌రెడ్డి

మహేశ్వరం: సామాజిక సేవే లక్ష్యంగా ఇంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్టు నిరంతరం పని చేస్తుందని చైర్మన్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఇమామ్‌గూడ సమీపంలో ఓ ఫంక్షన్‌హాల్లో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగం సాధించిన హర్షగూడ యువకులను అభినందించారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగులు పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్ తీసుకున్నారన్నారు. ఈ సందర్భంగా తమ ట్రస్టునుంచి పోలీస్ ఉద్యోగాలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాలతో సరిపెట్టకుండా భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానంలో ఎదగాలన్నారు. భవిష్యత్తులో ఇంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు, నిరుద్యోగులకు ఉపయోగపడే పోటీ పరీక్షల శిక్షణా శిబిరాలను నిర్వహిస్తామన్నారు. హర్షగూడ గ్రామానికి చెందిన ఏడుగురు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. అంతకుముందు వారిని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో హర్షగూడ ఉప సర్పంచ్ జె రవి నాయక్, ఎంపీటీసీ విజయ్ నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శరన్నవరాత్రి పూజలు



బడంగ్‌పేట: అమ్మవారిని దర్శించుకున్న సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడు ప్రతాప్

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు ఐదో రోజు శ్రీలలితత్రిపుర సుందరి దేవి అలంకారములో అమ్మవారు దర్శనమిచ్చింది. సుప్రభాత సేవ, అభిషేకం, సహస్రనామార్చన, శ్రీలలితత్రిపుర సుందరి దేవి హోమం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, లలితత్రిపుర సుందరి దేవి సహస్రనామ కుంకుమార్చన, మహామంగళహారతి, భజన కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సూర్ణగంటి ఆనందం యాదమ్మ దంపతులు శ్రీలలితత్రిపుర సుందరి దేవి హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్, డైరెక్టర్లు కె.చంద్రయ్య, యాదమ్మ, బాల్‌రాజ్, వెంకటేశ్, మహేందర్, రవి, పూజారులు వీరేశం, రాజు, జగదీష్, చెన్నాబుస్వ, రవికాంత్, సాయి, పలువురు భక్తులు పాల్గొన్నారు.



మహేశ్వరం: శ్రీలలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో అమ్మవారు

అమ్మవారి పూజలో మీర్‌పేట పోలీసులు..

మీర్‌పేట: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ వివేక్‌నగర్ కాలనీలో ఆర్‌ఎస్‌జే యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత అమ్మవారి మండపంలో మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఎస్‌ఐ గోవింద్‌స్వామిలు ప్రత్యేక పూజలు చేశారు.



నాదర్‌గుల్: కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న బీజేపీ నేత అందెల శ్రీరాములుయాదవ్



మహేశ్వరం: వివేక్‌నగర్‌కాలనీలో దుర్గామాత పూజలో సీఐ కిరణ్‌కుమార్, ఎస్‌ఐ గోవింద్‌స్వామి

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



కాంగ్రెస్‌లో చేరుతున్న దళిత బస్తీవాసులు

మహేశ్వరం: మహేశ్వరం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరంలోని ఎస్సీ బస్తీకి చెందిన పలువురు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దళితులకు లావాణీ పట్టాలు ఇచ్చారని, సీలింగ్ భూములు పంపిణీ చేశారని, ఇందిరమ్మ కాలనీలు ఏర్పాటు చేసి స్థలాలతో పాటు ఇళ్లు పంపిణీ చేశారని తెలిపారు. పేద విద్యార్థులు సైతం ఉన్నత విద్య అభ్యసించాలనే సంకల్పంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేసిందన్నారు. ఆరోగ్య శ్రీ, నిరుద్యోగ యువతకు రాజీవ్ యువశక్తి వంటి అనేక పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని తెలిపారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని పేర్కొన్నారు. మహేశ్వరంలో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి గడికోటపై జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తంచేశారు. అంతకు ముందు మహేశ్వరం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. నగరపంచాయతీ మాజీ వైస్ చైర్మన్, చిగురింత నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు.